బస్సీ...బస్సీ...భవాని యింకా రాలేదా పెద్దమ్మా" అనడిగాను ఆయాసంతో రొప్పిన స్వరంతో హాల్లో ఎదురుపడిన వరలక్ష్మి గారిని చూసి.

'ఏమిటి అంత కంగారుగా వస్తున్నావు...రావొచ్చు వస్తుంది...యిప్పుడే కాలేజి నుండి వచ్చింది పిలుస్తా ఉండు..." అంటూ లోపలికి వెళ్ళారు వరలక్ష్మమ్మగారు.

భవానీ వాళ్ళు మా పక్కింట్లో ఉంటున్నారు. మూడేళ్ళ క్రితం ట్రాన్స్‌ఫరై యిక్కడకు వచ్చారు. పెదనాన్నగారు అప్పట్నించి మా యిద్దరి కుటుంబాల మధ్య బంధుత్వంతో పాటు దగ్గరి స్నేహం ప్రబలింది. అందుకనే నాకూ తోబుట్టువులు లేకపోవటంతో నాకు భవాని మీద చెల్లెలితోపాటు అభిమానం కూడా ప్రబలింది.

చిన్నప్పటి నుండి కూడా చదువులో భవానిదే నా కన్న పై చేయి. నాకు తెలియని విషయాలు విడమరచి చెపుతూ తనతో పాటు నన్ను కూడా సెకండియర్ పరీక్షలు పాసయి ఆ తరువాత బి. ఏ. ఫైనల్ ఇయర్‌లోకి రావటానికి భవానీ ఎంతో తోడ్పడింది. బి. ఏ. లో భవానిది నాది ఒకటే గ్రూప్ అవటంతో భవాని ప్రిపేర్ చేసిన నోట్సు తోనే నే నెక్కువగా కాలం గడుపుతున్నాను. ముఖ్యంగా పాలిటిక్స్ ఎకనామిక్స్ నాకు కొరుకుడు పడని సబ్జెక్ట్సు. భవాని దగ్గర ఆ సబ్జెక్ట్సులో ఉన్న డౌట్సు తీర్చుకోవటం నాకు అలవాటై పోయింది. అప్పుడప్పుడు భవాని విసుక్కునేది — ఎంత చెప్పినా అర్థం కాదు నీ మొద్దు బుర్రకి' అని.

"అయితే ఫో... నువ్వేం చెప్పక్కరలేదు .. పెద్ద నీకే బాగా వచ్చునిగొప్ప...' అనేవాడిని ఉక్రోషంగా.

'మా తండ్రివి కదూ కూర్చో యింకెప్పుడూ విసుక్కోనుగా" అని బ్రతిమాలో.. నాకేం పోయింది ఫెయిలవుతావు. నే నెందుకూ ఎం.ఏ. లో చేర తానని బెదిరించో మళ్ళీ పాఠమంతా విపులంగా చెప్పేది.

సాధారణంగా నే వచ్చానూ అంటే ఏదో డౌట్ తీర్చుకుందుకే అనుకుంటుంది భవాని. అందులో పరీక్షలు దగ్గర పడుతున్నాయి కూడా.

"ఏం నాయనా మళ్ళీ ఏం డౌట్ వచ్చింది... పాలిటిక్స్‌లో మార్క్స్ థియరీ అర్థం కాకపోతే వదిలెయ్యి. యింక చెప్పనవి చెప్పలేను నిన్న" అంది కోపంగా.

అవును మరి తనకుమాత్రం కోపం రాదూ... నిన్న మార్క్స్ థియరీ పన్నెండుసార్లు చెప్పించు కానీ నాకు సరిగ్గా అర్థం కాలేదు

కాని యిప్పుడు నే వచ్చింది అందుక్కాదు. భవాని యింకా సుప్రభాతం పాడేలోపలే.

"చెల్లాయ్— నే వచ్చింది అందుక్కాదు .. నువ్వు నాకు హెల్ప్ చేసి పెట్టాలి' అన్నాను భవాని ముఖంలోకి చూస్తూ.

ఎప్పుడూ పాడే పాటేగా... ఏంటి చెప్పు అంది భవాని నా ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంటూ.

అట్లా అన్నందుకు కోపం వచ్చినా నా పని జరగాలంటే భవానీని మంచి చేసుకోవాలి గనుక సాధ్యమైనంత మృదుస్వరంతో,



# బహుమతి

మల్లాది లక్ష్మీనరసింహం

"చెల్లాయ్ .. మా తెలుగు ప్రొఫెసర్ గారు అందర్నీ ఎవరికి తోచిన టాపిక్ మీద వాళ్ళను వ్యాసాలు ప్రిపేర్ చేసుకు రమ్మన్నారు...కంపల్సరీ... నీకు తెలుసుగా నా తెలుగు పాండిత్యం... ప్లీజ్ నీకు తోచిందేదో ఒకటి ప్రిపేర్ చేసి యివ్వు సోమవారం లోపల యివ్వాలిట...యింకా నాలుగు రోజులే టైం ఉంది' అన్నాను.

'తెలుగు లో వ్యాసమా... బోర్... నాకు మాత్రం ఏం వచ్చు .. ఊం చూద్దాంలే యింకా నాలుగురోజులు గడువుందిగా... ఆరున్నరకి ఫైన్ ఆర్ట్స్ క్లబ్‌లో ఏదో నాటకం ఉంది పోదాం పద .. ఇంటికెళ్ళి త్వరగా మొహం కడుక్కొని డ్రెస్సు .. అసలు ఏ డ్రెస్సు వేసుకోవటానికే గంటవుతుంది. ఊఁ త్వరగా పద' అని తరిమి నంత పనిచేసింది.

'మరి నా వ్యాసం" అనబోయి ఇక భవాని వినదని తెలిసి మా యింటివైపు పరిగెత్తాను.

రెండు రోజులతర్వాత భవాని మాయింటికి వచ్చింది. తన చేతిలో ఉన్న కాగితాల వైపుచూసి 'థాంక్స్ చెల్లి .. చాలా థాంక్స్... ఇంతకీ ఏ టాపిక్ మీద ప్రిపేర్ చేసావు" అనడిగాను కుతూహలంగా

చెల్లాయి దిగులుగా నా ప్రక్కన కూర్చుని 'సారీరా అన్నాయ్ .. నేనెంత నెత్తి బాదుకున్నా ఒక్క ముక్క కూడా వ్రాయలేకపోయాను" అంది తెల్లకాగితాలు నాముందు పెడుతూ

కుతూహలంగా ముందుకు వంగిన నేను నిరుత్సాహంగా వెనక్కి కూలబడ్డాను.

కొంతసేపటికి హఠాత్తుగా భవాని 'పద...పద. అన్నయ్యా లైబ్రరీకి పోదాం" అంది సోఫాలోంచి

తేస్తూ

"ఎందుకు అన్నట్లు చూస్తున్న నన్ను చెయ్యి పట్టుకుని సోఫాలోంచి లేవదీసి "మళ్ళీ టైం అయిపోతుంది. ఎవరో పెద్ద రచయిత పుస్తకంలోంచి నాలుగు ముక్కలు కాపీకొట్టి వ్రాయడం కన్న గత్యంతరంలేదు" అంది.

"కాపీయా' అన్నాను భయపడుతూ.

అంతకన్న గత్యంతరం లేదురా అన్నాయ్... లేకుంటే ప్రొఫెసర్ కివ్యాసం యివ్వడంమానెయ్యి" అంది

తెలుగు ప్రొఫెసర్‌గారంటే మాకెంత గౌరవముందో అంత భయం కూడా ఉంది. వ్యాసం యివ్వకుండా ఉండటమన్నది అంత తేలికైన విషయం కాదు

'సరే పద అన్నాను అయిష్టంగానే.

ఇద్దరం లైబ్రరీకి చేరుకుని తెలుగు వ్యాస సంపుటిలు ఉన్న భాగంవైపు వెళ్ళాము.

'చూడు బాగా పాత పుస్తకం... కొంచెం చెదలుపట్టినదైతే మరీ మంచిది ... అటువంటి పుస్తకం ఒకటి తియ్యి" అంది తనూ నా వెనకాలే వస్తూ.

అల్మారా అంతా వెతికి బాగా మాసిపోయిన పుస్తకం ఒకటి తీసి భవానిచేతి కిచ్చాను.

భవాని ఆ పుస్తకం రెండో పేజీ చూసి

"ఊహూఁ...లాభంలేదు...ఇది 1949 పుస్తకం మీ ప్రొఫెసర్‌గారు చదివి ఉంటారు" అంది తిరిగి యిచ్చేస్తూ.

ఇంకో ఎదిహేను నిముషాలు కుస్తీ పట్టాక యింకో పుస్తకం పేజీలుకూడా సరిగ్గా లేంది బయటకు తీసాను .. ఆ పుస్తకం అక్కడక్కడ చెదలు పట్టిఉంది'

భవాని ఆ పుస్తకం లోపలి పేజీలు త్రిప్పి

"ఆ ... యిది మనక్కావల్సిన పుస్తకం ... 1920 లో ప్రింటయ్యింది .. పుస్తకం ఆఖరి పేజీ చూడు 1929 తర్వాత ఈ పుస్తకం ఎవ్వరూ తీసుకోలేదు దీంట్లో మొదటివ్యాసం పూర్తిగా ఉంది... ఆ తెల్లకాగితాలు తీసుకో... మక్కీకి మక్కీ కాపీకొట్టెయ్..." అంది.

నేనింకా సందేహించడం చూసి

"ఇంకా సందేహిస్తావెందుకు .. ఈకారచయిత గురించి ఏ భయం అక్కర్లేదు ... ఆయనీపాటికి 'గోవిందా కొట్టి ఉంటాడులే' అంది.

జేబులోంచి పెన్ తీస్తూ 'పుస్తకం పేరేమిటి" అన్నాను.

"సుబ్బారాయుడిగారి వ్యాసాలు' అని

"అరెరె టైటిల్‌కూడా వ్రాస్తేఎట్లారా.. నాదినిజంగా మట్టి బుర్రైపోతోంది పుస్తకం టైటిల్‌కాకుండా ఆ మొదటి వ్యాసం తీసి "మన సంస్కృతి అన్న హెడ్డింగ్‌తోసహా అంతా వ్రాసెయ్యి... నే డిక్టేట్ చేస్తాఉంటే..."

"అది కాలమునుండి భారతీయ సంస్కృతికి ప్రపంచము నందధిక ప్రాముఖ్యత గలదు... భారతీయ సంస్కృతియందు రోమనుల ప్రభావము యుండినదనుటను మనము పూర్తిగా ఖండించ జాలముగాని..." అంటూ భవాని చదువుకు పోతూంటే వణికే చేతుల్తో వ్యాసం పూర్తిచేశాను

సోమవారం నాడు అదేవణికే చేతుల్తో వ్యాసాన్ని తెలుగు ప్రొఫెసర్‌గారికిచ్చాను.

ప్రొఫెసరుగారు వ్యాసాన్ని చదివి ఏమంటారో అన్న భయంతో వారం రోజులు గడిపాను.

సరిగ్గా వారం రోజుల తర్వాత ప్రొఫెసరు క్లాసులోకివచ్చిరాగానే నావైపు చూశారు.

ఆయన అట్లా చూడగానే నాకు తెలియకుండానే నాముఖం అంతా కంపించ నారంభించింది... ఆయన తప్పకుండా నేను సుబ్బారాయుడుగారి వ్యాస సంపుటినుండి కాపీ కొట్టానని తెలుసుకొని ఉంటారు. అందుకనే అట్లా చూస్తున్నారని కొన్నాను.

ఇంకా ఆయన నావైపు చూస్తూఉండటం చూసి లేచి నిలబడ్డాను.

ఆయన, ఆప్యాయంగా నావైపు చూస్తూ క్లాసులోని విద్యార్థుల వైపు తిరిగి 'చూడండ్రా... ఆఖరి బెంచీలో కూర్చుని బుద్ధాయి అని పేరు తెచ్చుకున్న నరసింహం ఎంత మంచి వ్యాసం వ్రాసాడో...' "అంటూ అందర్లోకి నీ వ్యాసం బాగుందోయ్" అన్నారు మెచ్చుకోలుగా.

హమ్మయ్య... ఈయన కనిపెట్టలేదన్నమాట అది సుబ్బారాయుడిగారి వ్యాసమని.

ఇంతలోనే ఆయన నావైపు తిరిగి

"నీ వ్యాసం ఇంటర్ కళాశాల వ్యాస పోటీకి పంపించానోయ్" అన్నారు.

నేను కంగారుగా 'సార్...సార్...ఏదో క్లాసులో వ్రాయమన్నారని వ్రాసానే కాని ఇంటర్ కళాశాల పోటీకి పంపాలనే ఉద్దేశ్యమే నాకు లేదు సార్...ప్లీజ్ నా వ్యాసాన్ని పంపకండి" అన్నాను.

ఇంటర్ కళాశాల పోటీ అంటే ఆరి తేరిన జడ్జీలు ఉంటారు. తప్పకుండా నా చోరత్వాన్ని కనిపెట్టేస్తారు. అప్పుడు అవమానం తప్పదు... అదే నా భయం.

"నేను విన్నానె పంపించేసానోయ్...అదీకాక నా అంచనా ప్రకారం నీకు ఏదో ఒక బహుమతి వచ్చితీరుతుంది" అన్నారు ప్రొఫెసర్‌గారు.

అవును 'బహుమానం' తప్పదు.

అసలు భవానిని ఎట్లాకు తిట్టాలి ... వెధవ సలహా ఇచ్చినా ప్రాణంమీదికి తెచ్చింది.

మర్నాడు ఆదివారం కావటంతో ప్రొద్దున్నే భవానీ వాళ్ళింటికి వెళ్ళాను. నాలుగూ దులిపేసి నా పరిస్థితి చెప్పుకుందామని. ఎంత తిట్టినా మళ్ళీ చెల్లాయే గదాయె నాకు సలహాకి, ధైర్యానికి

ఆ వెళ్ళిన - ఊపులో నాలుగూ దులిపేసి పరిస్థితి అంతా చెప్పాను.

అంతా విని భవాని నవ్వుతూ "ఓస్...ఇప్పుడే మయిందని యింత గాభరా పడుతున్నావు... అంతటి తెలుగు భాషా పారంగతుడు విద్వాన్ బిరుదాంకితుడు అయిన మీ ప్రొఫెసర్‌గారే కనుక్కోలేక పోయినప్పుడు ఆఫ్టరాల్ ఆ జడ్జీలు కనుక్కోగలరా" అని నాటక ఫక్కీలో అంటూ.

"అరెరె మర్చిపోయాను...ప్రొద్దున్న పదిన్నరకి నఫైర్‌లో 'చో' 'దిల్ ఏక్ బందర్' నాటకం ఉంది. నాన్నగారు కూడా వస్తున్నారు. చాలా బాగుంటుందట ..నువ్వుకూడా రా..." అంది.

'చో నాటకాలంటే భవానికి యిష్టం అని వేరే చెప్పఖర్లేదను కుంటాను.

నాక్కూడా ఏం తోచక నాటకానికి బయల్దేరాను కానీ మనసంతా ఆ వ్యాసం మీదే ఉంది

ఆ తర్వాత కొద్దిరోజులకి మా ప్రొఫెసర్‌గారు కాలేజీ దగ్గర కనిపించి "నేను అనఫిషియల్‌గా అనుకున్నానోయ్... నీ వ్యాసంతో పాటు మరో మూడు వ్యాసాలు ఆఖరి దశకి చేరుకున్నాయట అందులో బాగున్నదానికి మొదటి బహుమానం యిస్తార్ట" అన్నారు.

నాకు గుండెల్లో దడ అధికమయింది. ఆఖరి దశకి చేరుకుంది. అంటే కల్య పరీక్ష చేస్తారు. ఒకవేళ పట్టుబడితే యూనివర్సిటీ వాళ్ళు కాలేజీ నుండి టి. సి యిచ్చి పంపేస్తే— ఆ పైన ఆలోచించలేక పోయాను.

తెలుగు ప్రొఫెసర్ గారిని సాధ్యమైనంత తప్పించుకు తిరుగుతున్నాను. ఆయన క్లాసులకుకూడా అటెండు అవటం మానివేసాను. కాని ఆయన దగ్గర్నుంచి రెండ్రోజుల తర్వాత హిస్టరీ క్లాసులో ఉండగా కబురొచ్చింది. వెళ్ళక తప్పలేదు.

ఆయన నన్ను చూస్తునే సాదారణంగా "నీవ్యాసంతో పాటు యింకొక కాలేజీ విద్యార్థి వ్యాసం ఫైనల్సుకి చేరిందోయ్' అంటూ అర్థాంతరంగా ఆపారు.

'ఇదేంఫుట్‌బాల్ మ్యాచా ఫైనల్స్‌కి రావడాని"కి అర్థంకాక ఆయన వైపు చూసాను.

"అదేనోయ్ ... ఇంకోకుర్రాడు భారత దేశపు ఆర్థిక విధానం' గురించి బ్రహ్మాండంగావ్రాసాట్ట... జడ్జీలు నలుగురిలో యిద్దరు నీ వ్యాసానికిప్రైజ్ యివ్వాలని... మరో యిద్దరు ఆ విద్యార్థి వ్రాసిన వ్యాసానికి యివ్వాలని భీష్మించుకు కూర్చున్నార్ట. అప్పుడే అనుకున్నా...అయినా నలుగురు జడ్జీలను నియమించటమేమిటని ... అందుకని యిప్పుడు తెలుగులో ఉద్దండుడైన పండితుని పిలిపించి మీ వ్యాసాలలో ఏది ఆయన బాగుందంటే దానికి ప్రథమ బహుమతి యిస్తార్ట. మిమ్మల్నిద్దర్ని కూడా రేపు సాయంత్రం యూనివర్సిటీతెలుగు సెక్షన్‌కి రమ్మని చెప్పారు" అన్నారు

నాకు కాళ్ళలో వణుకు ప్రారంభమైందప్పుడే.

మర్నాడు భవానితో కూడా చెప్పకుండా యూనివర్సిటీకి వెళ్ళాను.

అక్కడ మా తెలుగు ప్రొఫెసర్‌గారు నన్ను చూసి చిరునవ్వుతో భుజం తట్టారు ధైర్యం చెపుతున్నట్లు.

'భారతీయ ఆర్థిక విధానం' గురించి వ్రాసిన విద్యార్థి నన్ను చూసి చిరునవ్వుతో 'బెస్ట్ ఆఫ్ లక్" అన్నాడు.

"నో...నో.. మొదటి బహుమతి మీకు వస్తేనే, బాగుంటుంది" అన్నాను అప్రయత్నంగా... నాకెందుకో యిప్పుడు భయంపోయి బహుమతికి నేను తగను అనిపిస్తోంది.

మేమిద్దరం రూంలోకి అడుగుపెట్టాము.

పండిన వెంట్రుకలతో పండు ముసలాయన వాలు కుర్చీలో కూర్చుని ఉన్నాడు. ఆయన

గంభీరాకృతిని చూడగానే భయంవేసింది. ఈయన తప్పకుండా నా చోరత్వాన్ని కనిపెట్టి [illegible] ప్రవర్తిస్తారనిపించింది.

ఇంతలో మా తెలుగు ప్రొఫెసర్‌గారు నన్ను. అతన్ని ఆయనకు పరిచయం చేసారు. ఆయనని మాకు పరిచయంచేస్తూ.

'ఈయనే ప్రఖ్యాత తెలుగు పండితులు సుబ్బారాయుడుగారు" అన్నారు.

నాగుండెల్లో రైలు పరిగెత్తాయి.

ఆ తర్వాత గుండె ఒక సెకను కొట్టుకోవటం మానివేసింది.

'నేను ఆఖరి సారిగా 1920 లో వ్రాశాను... కాబట్టి మీకు తెలిసి ఉండక పోవచ్చు... నన్ను ప్రఖ్యాత పండితుడనని పరిచయం చేసిన మీ తెలుగు ప్రొఫెసర్‌గారు అప్పటికిపుట్టి ఉండరేమో" అన్నారు సుబ్బారాయుడుగారు నవ్వుతూ

ఆ తర్వాత ఆయన భారతీయ ఆర్థిక విధానము' అన్న వ్యాసం తీసి చదివి నాతోవచ్చిన విద్యార్థిని నానా ప్రశ్నలు వేసి అతను తృప్తికరంగా సమాధానాలిచ్చాక నా వ్యాసం తీసారు.

నేను నేలచూపులు చూడసాగాను.

మనసులో దేవుడిమీద కోపం తారాస్థాయి నందుకుంది.

ఆయన వ్యాసమంతా చదివి.

ఎవరు చెప్పారోయ్.. భారతీయులు రోమనుల నుండి సాంస్కృతిక సూత్రాలు గ్రహించారని' అని మండిపడ్డారు.

నేను ఆయన వైపు ధైర్యంగా తలెత్తి చూసాను ఆయన ముఖంలో ఎటువంటి భావాలు కనపడలేదు.

హమ్మయ్య ... ఆయన వ్యాసం ఆయనే గుర్తించలేదన్నమాట. వింతయిన విషయమైనా నా అదృష్టానికి నన్ను నేనే మెచ్చుకున్నాను

ఆ తర్వాత ఆయన కొంతసేపు ఆలోచించి నాతోవచ్చిన విద్యార్థివ్రాసిన వ్యాసానికి ప్రథమ బహుమతి యిచ్చేటట్లు ప్రకటించారు.

అందరం అతన్ని కంగ్రాచ్యులేట్ చేసాము. విజానికి అందరి కంటె మనస్ఫూర్తిగా కంగ్రాచ్యులేట్ చేసింది నేనె నవ్వించింది. —

మా తెలుగు ప్రొఫెసర్ గారి దృష్టినుండి తప్పించుకొని హాయిగా ఊపిరి పీల్చి బయటకు వస్తుంటే సుబ్బారాయుడుగారు అదరా బాదరాగా నాదగ్గరకు వచ్చి నా రెండు చేతులు పట్టుకొని. నాకెంతో సంతోషంగాను. గొప్పగాను ఉందోయ్.. నా వ్యాసాలు యిన్నేళ్ళకి యింకా చదివె వాళ్ళున్నారంటే .. ఇంకొంచెం అభ్యాసం చేస్తే నా మనసు నీవైపు తిరిగి నీకే మొదటి బహుమానం యిస్తానని భయం వేసి అవతలతనికి యిచ్చేస్తాను' అని చెప్తూ అంత హడావిడిగాను వెళ్ళిపోయారు

ఆయన వెళ్ళిన వైపు చూస్తూ నిశ్చేష్టుడనై నిల్చుండిపోయాను

(మాక్స షుల్‌మన్‌కి కృతజ్ఞతతో)

★



# పొగ!

ఉర్దూ మఖ్దూం మొహియుద్దీన్

తెలుగు · గజ్జల మల్లారెడ్డి

స్వర్గం భూమిపైకి దిగివచ్చిన రాత్రి
సర్వేశ్వరుని కృపామేఘాలావరించిన ధాత్రి
సంపదలు కేంద్రీకరించి నిలచిన పీట
సమస్తాన్ని శాసించే శక్తి సహకారమై
మొలచిన చోట
ఔను! అక్కడే నా హృదయం
ఇంకో దృశ్యం చూసింది
ఔను! అక్కడే నా పాపిష్ఠి దృష్టి
మరో దృశ్యాన్ని తిలకించాయి
రైతు కూలీల రక్తవాహినులో
మైనోన్నత మేడల విలాస విహారాలు
న్యాయం పేరుగు విరిచె కాలుతున్న పొగ!
నలువైపులా పొగ! పొగ!

మూలం . డుం వా

## ప్రేమా పెళ్ళి

(35 వ పేజీ తరువాయి)

న్నాశించి. మనిషిని దరిచేర్చుకుని మనువుకుదుర్చుకుని. మూడునెలలు తిరక్కుండా. వారి స్వార్థం నెరవేరదని తెలుసుకుని మాసిన చొక్కాని విప్పేసి మూల పారేసినట్టు ప్రేమని దూరంగా నెట్టేసి పుత్తి మనుష్యులు- మాత్రమే మిగిలిన యీ కథల్లోని మనుష్యుల్లో కలిగింది నిజంగా ప్రేమేనా? అని ఎవరికనిపించదు? పెళ్ళికిముందు యిరు హృదయాల్లోను అంకురించిన ప్రేమ. పెళ్ళితో పరిణతిచెందింది. వారి దాంపత్య జీవితాన్ని పండించాలిగాని. జీవితాన్ని వేడుచేసే ప్రేమా? కొత్తగా జీవితంలోకి అడుగుపెట్టవలసినవారు. ప్రేమించటం నేర్చుకోవాలనుకునేవారు యిలాంటి జీవితాన్ని చూసాక 'హవాయె లవ్ మారేజెస్ అంటే ఇవా? అంటూ భయపడకమానరు. ఐతే అన్ని లవ్‌మారేజెస్ యిలానే వున్నాయనికాదుగాని కొన్నిమాత్రం జరిగిపోతున్నాయి వీటిని చూస్తుంటే పెళ్ళయ్యాక ప్రేమ బీజాన్ని నాటుకుంటున్న జీవితాలే నయమనిపించదూ?

★